భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు పూజలు


ఉప్పుగూడ మహంకాళి మాతేశ్వరీ ఆలయ కుంకుమార్చన

అబిడ్స్, చార్మినార్, మెహదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అమ్మవార్ల ఆలయాలో శుక్రవారం భక్తులతో పోటెత్తాయి. ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు హోమాలు కుంకుమార్చలు నిర్వహించారు. పలు చోట్ల అమ్మవార్లలు ఫలాలతో, పూలతో కూరగాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా పోతరాజుల నృత్యాలు, ఫలహారం బండ్ల, తొట్టెల ఊరేగింపులు సందడిగా సాగాయి.

– అబిడ్స్, చార్మినార్, మెహదీపట్నం జోన్ల బృందం


బంగారు బోనం తీసుకొస్తున్న ఆలే భవ్య తదితరులు


కోట మైసమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన


పట్టు వస్త్రాలు సమర్పించిన ఈఓ భ్రమరాంబ, బోర్డు చైర్మన్ రాంబాబు


బంగారు ముత్యాలమ్మ ఆలయంలో.. డిప్యూటీ స్పీకర్, అశ్వినిమార్గం, జెట్టి గోపాల్


అక్కన్న మాదన్న ఆలయంలో.. ఎల్లమ్మ దేవస్థానం ఈఓ అన్నపూర్ణ కుటుంబ సభ్యులు


దుర్గా హోమంలో పాల్గొన్న భక్తులు


వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కొనసాగిన మహా పూర్ణాహుతి


టీఎన్జీఓస్ కార్యాలయంలో.. పప్పుమాత్రే, జగపతి సాయి తదితరులు


కిషన్‌గంజ్‌లో.. నందకిశోర్ వ్యాస్ బిలాల్, నరేందర్ యదవ్ తదితరులు


బేగంబజార్‌లో.. ఆశీష్‌కుమార్ యాదవ్


వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్


జిన్సీచౌరాయిలో..


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్


గుండు పోచమ్మకు పట్టుచీర సమర్పిస్తున్న శ్రీ శక్తి నారి తరంగిణి సభ్యులు


లాల్‌దర్వాజ మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సాయిబాబాచారి తదితరులు


చందూలాల్ బేలాలోని మాతేశ్వరి ముత్యాలమ్మకు చప్పన్ భోగ్ పూజలు


జియాగూడ మహంకాళి ఆలయంలో.. సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు

క్లుప్తంగా...

అభివృద్ధి పనులు వేగవంతం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండలోని అట్టారసిడి, రేషంబాగ్ బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన గోల్కొండలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి స్థానికులకు వివరించారు. వర్షాకాలంలో వరదనీరు రోడ్లపై ప్రవహించకుండా డ్రైనేజీ పైప్‌లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అబ్దుల్ రహీం, హారూన్ ఫరాన్, తహసీమ్ తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మమతాగుప్తా, సంతోష్‌గుప్తా, ముఖేష్ సింగ్, ఆనంద్‌కుమార్

అబిడ్స్: ధూల్‌పేట్‌లో బీఆర్ఎస్ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆది, సోమవారాల్లో పలు ప్రాంతాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాల పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకులు మమతాగుప్తా, సంతోష్‌గుప్తా, ముఖేష్ సింగ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, ఆల పురుషోత్తమ్‌రావు, పరమేశ్వరి సింగ్, శాంతిదేవి ఆవిష్కరణ చేశారు.

ఆహ్వానం



గౌలిపురా: పాతబస్తీ గౌలిపురా సీబీబీలోని నల్ల పోచమ్మ ఆలయంలో నిర్వహించే బోనాల ఉత్సవాల్లో పాల్గొని కోరుతూ బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను శుక్రవారం ఆలయ కమిటీ ప్రతినిధులు కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్, సభ్యులు విఠల్ రావు, సాయి, సుచిత్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


వి.హెచ్‌ను సన్మానిస్తున్న పాటేల్ సదానంద్ యాదవ్, పాటేల్ శ్రీనివాస్‌యాదవ్

చార్మినార్: పాతబస్తీలో ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంత్‌రావు అన్నారు. శుక్రవారం మాతేశ్వరి మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాటేల్ సదానంద్ యాదవ్, పాటేల్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

వీధి కుక్కల స్వైర విహారం

లంగర్ హౌస్: వీధి కుక్కలు లంగర్ హౌస్‌లో స్వైర విహారం చేశాయి. ఒక మేకపై, ముగ్గురు చిన్నారులపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. శుక్రవారం రాత్రి ఈ ఘటన లంగర్ హౌస్ లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మీ నగర్‌లో ఓ నాలుగున్నర ఏళ్ల చిన్నారి సరస్వతి పవర్ మొదటి అంతస్తులోని వారి ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క వెళ్లి దాడి చేసింది. చిన్నారి అరుపులు విని కుటుంబీకులు పరిగెత్తుకొని రావడంతో కుక్క వెళ్లిపోయింది దారిలో మరో రెండు కుక్కలతో కలిసి ఆరు సంవత్సరాల ఇద్దరు చిన్నారులపై దాడి చేశాయి. అంతకుముందు మధ్యాహ్నం పక్క వీధిలో మూడు కుక్కలు కలిసి మేకపై దాడి చేశాయి. గాయాల పాలైన చిన్నారులను చికిత్స నిమిత్తం గోల్కొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడిపై కత్తితో దాడి

చాంద్రాయణగుట్ట: ఒకే కుటుంబంలో ఇద్దరు పరస్పరం దాడులు చేసుకోగా ఒకరికి కత్తిపోట్లు పడ్డాయి.. మరొకరి తలకు గాయమయ్యింది. చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బార్కాస్‌కు చెందిన ఖాలేద్ యాఫై, అబ్దుల్ రహిమాన్ ఒకే కుటుంబ సభ్యులు. శుక్రవారం సాయంత్రం ఇద్దరి నడుమ గొడవ జరిగి బాబానగర్ రోడ్డులో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఖాలేద్ యాఫైకి కత్తిపోట్లు పడ్డాయి.. రహిమాన్ తలకు గాయమయ్యింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గొడవకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై కేసు నమోదు చేయాలి

గన్‌ఫౌండ్రీ: బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్యపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడం బాధాకరమని బాధితురాలు శేజల్ అన్నారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై తక్షణమే కేసు నమోదు చేయాలని కోరుతూ.. శుక్రవారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని గుర్తుచేశారు. కానీ పోలీసులు తన ఫిర్యాదును స్వీకరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చిన్నయ్య తన అనుచరులతో కలిసి తనను, తన కుటుంబాన్ని మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కన్నీరుమున్నీరయ్యారు. కాగా ఆందోళన చేస్తున్న శేజల్‌ను పోలీసులు మహిళా పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

నకిలీ డాక్టర్ అరెస్ట్

చాంద్రాయణగుట్ట: నకిలీ సర్టిఫికెట్లతో డాక్టర్‌గా చలామణి అవుతున్న ఓ వ్యక్తిని, అతనికి సర్టిఫికెట్‌ను సమకూర్చిన మరో వ్యక్తిని సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన ఖాజా ముజమిల్‌ద్దీన్(29) ఇంటర్మీడియట్ ఫెయిలై... అనంతరం మాసబ్‌ట్యాంక్‌లోని ఓ దంత వైద్యశాలలో పనిచేశాడు. ఆ అనుభవమే పెట్టుబడిగా పెట్టుకొని తన స్నేహితుడు సయ్యద్ అబ్దుల్ అస్లాం ద్వారా కర్నాటక నుంచి నకిలీ బీడీఎస్ డాక్టర్ సర్టిఫికెట్‌ను పొందాడు. 2020 నుంచి ఫలక్‌నుమాలో ఆక్సిజన్ డెంటల్ క్లీనిక్ నిర్వహిస్తున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్, శాలిబండ శాలిబండ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి వైద్య సామాగ్రి, నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

గౌలిపురా: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కమ్ స్పెషల్ సెషన్స్ జడ్జి టి.అనిత 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన షేక్ ఫరీద్ (53) 2018లో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు షేక్ ఫరీద్‌ను సాక్ష్యాధారాలతో శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగా విచారణ చేపట్టిన 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కమ్ స్పెషల్ సెషన్స్ జడ్జి టి.అనిత నిందితుడు షేక్ ఫరీద్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రేపు ఉప్పుగూడలో ఫలహారపు బండి ఊరేగింపు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ అశోక్‌నగర్‌లోని సప్తమాతృక ఆలయం తరపున బోనాల ఉత్సవాల్లో భాగంగా ఈనెల 16న ఫలహారపు బండి ఊరేగింపును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వర్కల నాగరాజుల తెలిపారు. 19 ఏళ్లుగా ఫలహారపు బండి ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలనంతరం ఉప్పుగూడ పరిసరాలలో ఊరేగింపు కొనసాగుతుందన్నారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

విజయనగర్‌కాలనీ: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని డిప్యూటీ పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్ అన్నారు. శుక్రవారం విజయనగర్‌కాలనీలోని సెయింటాన్స్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ సెర్మనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు ఎన్నుకోబడిన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందజేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఏపీజే అబ్దుల్‌కలాం వంటి వక్తలను ప్రేరణగా తీసుకుని విద్యార్థులు ఐక్యతభావంతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ ఆరోగ్యమేరి దివ్య, కరస్పాండెంట్ సిస్టర్ రోజీఫ్రాన్సిస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


సెల్యూట్ స్వీకరిస్తున్న పోలీస్ అధికారి జోయల్ డేవిస్, ప్రిన్సిపాల్ సిస్టర్ ఆరోగ్యమేరి దివ్య

పేకాటరాయుళ్లకు రెండు రోజుల జైలు

డబీర్‌పురా: పేకాట ఆడుతున్న 12 మందికి నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు 2 రోజుల జైలు శిక్ష శుక్రవారం విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎన్.ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధి ప్రాంతానికి చెందిన షేక్ సుజాత్‌తో పాటు మరో 11 మందితో కలిసి శుక్రవారం పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మీర్‌చౌక్ పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో షేక్ సుజాత్‌తో పాటు 11 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా.. విచారణ చేపట్టిన 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు 2 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఎస్ఐఓ నాయకులపై కేసు

గోల్కొండ: స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ వారు ఇస్లాం మతంలోకి మారడానికి మసీదు ముందు ప్రచారం నిర్వహించినందుకు వారిపై హుమాయున్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ ఏడాది ఏప్రిల్ 30న స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ వారు హుమాయున్‌నగర్‌లోని అజీజియా మసీదులో ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించి విజిట్ మై మజీద్ అనే కార్యక్రమం కూడా నిర్వహించారు. అదే రోజు మసీదు ముందు వెళ్తున్న ముస్లిమేతరులను ఆపి వారిని మసీదు సందర్శించాలని కోరారు. అంతేకాకుండా ఇస్లాం మతంలోకి మారాలని వారిని బలవంతం చేశారు. ఈ విషయంపై కొందరు హుమాయున్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పలువురు ఎస్ఐఓ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

నేడు ఘటం ముగింపు, అమ్మవారికి తొట్టెల సమర్పణ

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ బుజిలీ మహంకాళి అమ్మవారికి భారీ తొట్టెల సమర్పించి ప్రధాన బోనాల ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆర్లెల్ల కృష్ణాయాదవ్ అన్నారు. లంగర్‌హౌస్‌లోని ప్రధాన ఆలయం గోల్కొండ బోనాల సందర్భంగా ప్రథమ పూజ నిర్వహించే మార్కెట్ రోడ్డులోని బుజిలీ మహంకాళి ఆలయంలో శుక్రవారం ఘటం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాయాదవ్ మాట్లాడుతూ.. శనివారం మధ్యాహ్నం లోపు ఘటం ఊరేగింపు ముగించనున్నామన్నారు. మధ్యాహ్నం తరువాత 36 అంతస్తుల ఎత్తైన భారీ తొట్టెలను లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించనున్నామన్నారు. ఈ పూజల్లో కమిటీ సభ్యులు రవికాంత్, భాస్కర్, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్ ఉన్నారు.


ఘటం పూజల్లో కృష్ణాయాదవ్ తదితరులు

న్యూసెన్స్ కేసులో వ్యక్తికి జైలు

డబీర్‌పురా: రాత్రి వేళల్లో ఛబుత్రాలపై కూర్చొని న్యూసెన్స్ చేస్తున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు 21 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డబీర్‌పురాకు చెందిన మహ్మద్ ఇబ్రహీం (20) రాత్రి వేళల్లో ఛబుత్రాలపై కూర్చొని స్థానికంగా న్యూసెన్స్ చేస్తున్నాడు. దీంతో పోలీసులు మహ్మద్ ఇబ్రహీంను అరెస్ట్ చేసి ఈ-పెట్టీ కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు ఇబ్రహీంను నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు వహాబ్‌కు 21 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మంగళ్‌హాట్‌లో ఫ్లెక్సీ వివాదం

అబిడ్స్: బోనాల పండగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి దారితీసింది. ఇరువర్గాల వారు మంగళ్‌హాట్ ప్రాంతంలో ఘర్షణకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకుంది. మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రవి, స్థానికుల వివరాల ప్రకారం.. బోనాల పండుగను పురస్కరించుకుని మంగళ్‌హాట్ ఇంద్రానగర్‌లో సంతోష్‌గౌడ్ అనే వ్యక్తి ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా రాజు అనే స్థానికుడు ఫ్లెక్సీని ఏర్పాటు చేయొద్దని వాదించాడు. దీంతో ఇరువర్గాల వివాదం ఘర్షణకు చోటుచేసుకుంది. గురువారం అర్ధరాత్రి సంతోష్‌గౌడ్, రాజు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగడంతో ఓ వ్యక్తి తలకు బలమైన గాయమైంది. ఉమేష్ సింగ్ తలకు గాయం కాగా మరికొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మంగళ్‌హాట్ పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక వర్గం తరపున మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళకృష్ణ ఉన్నట్లు ఫిర్యాదు రావడంతో ఆమెపై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. సంతోష్‌గౌడ్, రాకేష్ గౌడ్, నరేందర్‌గౌడ్‌లను అరెస్టు చేసి మిగతా వారికోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు.

'పాతబస్తీ ఆలయాలను సందర్శించడం దైవ సంకల్పం'

చార్మినార్: పాతబస్తీ ఆలయాలను సందర్శించడం దైవ సంకల్పంగా భావిస్తున్నానని బల్కంపేట ఎల్లమ్మ తల్లి దేవస్థానం ఈఓ అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం పాతబస్తీలోని చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంతో పాటు బంగారు మైసమ్మ, అక్కన్న మాదన్న, సుల్తాన్‌షాహీ జగదాంబ, లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆలయం, ఉప్పుగూడ మహంకాళి ఆలయం, మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయాలను అన్నపూర్ణ దంపతులు సందర్శించి అమ్మవార్లకు ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గాజుల అంజయ్య, మధుసూదన్‌యాదవ్, అనంతోజు హన్స్‌రాజ్ ఉన్నారు.


పూజల్లో పాల్గొన్న ఈఓ అన్నపూర్ణ దంపతులు

దేవర కరుణాకర్ సేవలు ఎనలేనివి



గోల్కొండ: దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ సేవలకు వెలకట్టలేమని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి భగవంతరావు అన్నారు. శుక్రవారం కరుణాకర్ జ్ఞాపకార్థం జనహిత్ చారిటబుల్ ట్రస్ట్ అండ్ డీఎంఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ ఉప్పర్‌బస్తీలో భగవద్గీత పారాయణం, భగవద్గీత పుస్తకాల పంపిణీ నిర్వహించారు. బాలాంజనేయ ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. జనహిత్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు దేవర వంశీ, బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు రామరాజు, నాయకులు దేవర శ్రీనివాస్, గోల్కొండ జిల్లా బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ బోడి అశోక్‌కుమార్‌యాదవ్, కట్ల అశోక్, నామా యాదగిరి తదితరులున్నారు.

పాతబస్తీ అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ

చార్మినార్: బోనాల ఉత్సవాల్లో భాగంగా విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈఓ భ్రమరాంబతో పాటు బోర్డు చైర్మన్ రాంబాబు, బోర్డు సభ్యుల బృందం శుక్రవారం రాత్రి పాతబస్తీలోని ప్రధాన ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. విజయవాడ అధికారుల బృందానికి భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్‌తో పాటు ప్రధాన ఆలయాల కమిటీ ప్రతినిధులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలను అందజేశారు. సుల్తాన్‌షాహీ జగదాంబ దేవాలయం కమిటి చైర్మన్ రాకేశ్ తివారీ ఆధ్వర్యంలో పగిడీలు కట్టి ఘనంగా సత్కరించారు. ఈఓ భ్రమరాంబ, చైర్మన్ రాంబాబులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ తరపున ప్రతి ఏడాది ఏపీలో తెలంగాణ బోనాల జాతర నిర్వహిస్తూ విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి బంగారు బోనం, పట్టు వస్త్రాలు,ఒడి బియ్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.


పట్టు వస్త్రాలు సమర్పించిన ఈఓ భ్రమరాంబతో పాటు బోర్డు చైర్మన్ రాంబాబు